# పెళ్లి అనే పెళ్లి

★ పి. కృష్ణరాయలు ★

నన్ను చూసి నేనే గర్వించేవాడిని. స్వతహా నాలో వున్న గొప్పతనము ఏమీ లేదు. పది మంది చూసి నన్ను 'పెద్దవాడవు అయ్యావు' అంటే నిజమే అనుకొనేవాడిని. అలా అన్నప్పుడు ఒకసారి చేయి మీసాలు, గెడ్డంమీదికి పోయేది. కాని చేతికి అందేవి కావు 'పెళ్ళి యీడుకు వచ్చావు. ఏదో నిన్నుకూడ ఓ యింటి వాడిని చేస్తే—' అని మా అమ్మ అంటూవుంటే నాతో నాకు ఏదేదోలాగ వుండేది.

నాకు వచ్చే సంబంధాలు చూస్తే, యీ లోకం లో నాకంటె గొప్ప వరుడు ఇంకెవ్వడు లేడేమో అనుకునేవాడిని. విశాఖపట్టణం, మచిలీపట్టణం మొదలగు పట్టణాలు మొదలుకొని పాలకొల్లు, భీమవరం, రాజోలు ఇంకా వుభయగోదావరి, కృష్ణామండలపర్యంతం నాకొఱకు తిరిగేవారే. పూర్వకాలంలో కన్యలకొఱకు యుద్ధాలు జరిగిన వని విన్నామేకాని యీ రోజుల్లో నాకొఱకు వీరంతా యుద్ధాలు చేస్తారేమో అనిపించేది.

అసలు పెళ్ళి అంటే నాకు ఇష్టం లేదు. అందులో ఏదో పెద్ద సుఖము వుందని అందరు అనే వారుకాని నాకు అది ఏదో కష్టంగానే వుండేది. ఇంటికి రావడం ఆలస్యం, మా అమ్మ 'రాజమండ్రి వారిది మంచి సంబంధమే, అమలాపురంవారు అన్నివిధాలా...' అంటూవుంటే, నా గొప్పతనానికి లోన సంతోషించి పైకి 'చూద్దాంలే' అనే వాడిని. ఏ వీల్లో చూసినా, ఎక్కడ పదిమంది దగ్గర చేరినా 'మీరు ఫలానా కాదండీ, మీకు పెళ్ళికాలేదుకదూ ?' అనేవారే ఎవర్నిచూసినా. ఇక ఇలా కాదనుకున్నా—ఎవరన్నా పెళ్ళి సంగతి ఎత్తితే 'అయిందండీ' ఓ వంశోద్ధారకుడు కూడా—' అనేవాడిని. కర్మంజాలక ఎవరన్నా 'అత్తవారు ఏ వూరు' అంటే ధైర్యంగా 'మా వూరే' అని సమాధానము.

కొంతకాలానికి పెళ్ళి చేసుకోవడం నిశ్చయం అనుకున్నా, అందులో ఏదో సుఖం వుందనే నమ్మకానికి వచ్చా. సరే చదువుకున్నవారు అని నేనంటే, మంచి కట్నాలవాళ్లు అనేవాడు మా నాన్న. 'చదువుకున్నవాళ్లొచ్చి మా నెత్తిన ఎక్కడానికా బాబు' అని సాగేసేది మా అమ్మ. ఎంతకైనా 'ధనమూలమిదంజగత్' చదువు ఎవడికి కావాలి. యీ ధనయుగంలో, చేతిలో నాల్గు రాళ్లువుంటే ఏ వెధవపని చేసినా చెల్లుతుంది యీ రోజుల్లో. మావాడు యీమధ్య బ్లాక్ మార్కెట్ లోను, బ్రాకెట్ కంపెనీలోను పదివేలు సంపాదించాడు అంటే వున్న గౌరవ మర్యాదలు మావాడు యం.ఏ. మొదటి తరగతి లో వుత్తీర్ణుడయ్యాడు అంటే వుండదు. అందుకనే డబ్బువచ్చే సంబంధాలకు ప్రాధాన్యమిచ్చాను.

ఒకరోజున అన్నం తింటూవుంటే 'నా మాట విని పెద్దవాళ్లను వుసురుపెట్టక ఆ అనకాపల్లి పిల్లను చేసుకో, లేకపోతే మీ నాన్న మంచం పడతారు' అంది మా అమ్మ.

'సరే నాన్న యిష్టమే నా ఇష్టం' అన్నా చివరకు. ఆ మరుచటిరోజు మా నాన్న గదిలోకి పిల్చి యీ విషయాలే మాట్లాడుతున్నాడు. 'మరి పిల్లను చూడడం విషయము' అన్న సందర్భంలో 'పదివేలు కట్నం అయితే ఇంకా పిల్లను చూడడం ఏమిటి' అన్నాడు.

మాఘమాసంలో పెళ్లి నిశ్చయించేసారు. ఇంకా నాల్గు రోజులుంది గడువు. ఆ నాల్గు రోజులు వధువును చూడకుండా పెళ్ళేమిటి అనే ఆందోళనే నాకు. ఇంట్లో ఏ మూల చూసినా 'పదివేలు కట్నం, వెయ్యిన్నూట పదహార్లు ఆడబడుచుల కట్నం, వియ్యాలవారి లాంఛనాలు' అనే పదాలు వినపడేవి. ఆ రాత్రి పెళ్లి అనగానే సందకాడే చేరాం పెళ్లివారి వూరు, బంధు మిత్రులతోటి పెళ్లి లక్షణంగా జరిగింది. అనుకున్న కట్నం వచ్చేసింది. ఆ సాయంత్రం పెళ్లి ఇంట్లో గుసగుసలు బయలుదేరాయి. ఇంకేమి చెప్పేది ? వధువు మూగ. ఇలా కిందామీదా పడుతూవుంటే కాసేపటిలో పోలీసుదండు వచ్చిపడింది ఇంటి చుట్టూ వియ్యాలవారిచ్చిన దొంగనోట్లు పట్టుకుంటానికి.